సాక్షి నిర్మల్

ఆదివారం । 3 । ఆగస్టు । 2025



మంత్రిని కలిసిన విఠల్‌రెడ్డి

తానూరు(ముధోల్‌): రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ముధోల్‌ మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిని వివరించారు.

భైంసా ఆర్డీవో బదిలీ



భైంసాటౌన్‌: భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి బదిలీ అయ్యారు. మహబూబ్‌నగర్‌ స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. భైంసా సబ్‌ కలెక్టర్‌గా అజ్మీర సంకేత్‌కుమార్‌ను నియమించిన విషయం తెలిసిందే.

గరిష్టం/కనిష్టం
32.2 /24.4

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

పాదయాత్ర రూట్‌మ్యాప్‌ పరిశీలన



సుర్జాపూర్‌లో విద్యార్థులతో వెడ్మబొజ్జు, శ్రీహరిరావు

ఖానాపూర్‌: ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్‌తోపాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ చేపట్టిన జనహిత పాదయాత్ర ఆదివారం జిల్లాకు చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో రూట్‌మ్యాప్‌ను ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు శనివారం పరిశీలించారు. ఖానాపూర్‌ మండలం బాదనకుర్తి గ్రామంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే పాదయాత్ర సుర్జాపూర్‌, మస్కాపూర్‌ గ్రామాల మీదుగా ఖానాపూర్‌ పట్టణం వరకు సాగుతుంది. రాత్రి 9 గంటలకు పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో నైట్‌హాల్ట్‌ ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం ఖానాపూర్‌లోని బస్టాండ్‌, ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతాల్లో శ్రమదానం ఉంటుందన్నారు. అనంతరం జేకే ఫంక్షన్‌హాల్‌లో పార్టీ కార్యకర్తలతో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్‌ పార్టీ శ్రేణులు తరలివచ్చి జనహిత పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు.

చివరి ఆయకట్టు వరకు నీరందించాలి



ఇరిగేషన్‌ కార్యాలయం వద్ద చిట్యాల్‌ రైతులు

కడెం: కడెం ప్రాజెక్టు కుడి కాలువ చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించాలని మండలంలోని చిట్యాల్‌ గ్రామ రైతులు డిమాండ్‌ చేశారు. మండల కేంద్రంలోని ఇరిగేషన్‌ కార్యాలయంలో అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు. కొండుకూర్‌ నుంచి చిట్యాల్‌ వరకు కుడి కాలువ పిచ్చిమొక్కలు, చెత్తచెదారంతో నిండిపోవడంతో సాగునీరు అందడం లేదని రైతులు తెలిపారు. చిట్యాల్‌ శివారులో సుమారు 500 ఎకరాల ఆయకట్టు ఉందని, నాట్లు వేసేందుకు సాగు నీటి కోసం ఎదురు చూస్తున్నామన్నారు. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు, చెత్తచెదారం తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్‌, రైతులు ధర్మాజి కిష్టయ్య, రమేశ్‌, జలపతి, ఇస్రూ, తిరుపతిరెడ్డి, ఇందన్న, శంకరయ్య, గంగారెడ్డి, రాజలింగు, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పీజీహెచ్‌ఎంల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

నిర్మల్‌ రూరల్‌: జిల్లాలో ఉపాధ్యాయుల ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. శుక్రవారం పీజీహెచ్‌ఎం ప్రమోషన్ల కోసం అర్హులైన స్కూల్‌ అసిస్టెంట్‌ ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్‌ పూర్తి చేశారు. 24 పీజీహెచ్‌ఎం పోస్టులను ప్రమోషన్‌ ద్వారా భర్తీ చేయనున్నారు. శనివారం సాయంత్రం వేకెన్సీ జాబితా లిస్టు, ప్రొవిజినల్‌ సీనియార్టీ లిస్టును వెబ్‌సైట్‌లో ఉంచారు. ఆదివారం అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఎస్జీటీలను స్కూల్‌ అసిస్టెంట్లుగా 70% పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. వీరికి ఆగస్టు 1 ప్రామాణికంగా తీసుకుంటారు. జాబితా ఇప్పటికే సిద్ధం చేశారు.

ఖానాపూర్‌లో బంద్‌ సంపూర్ణం




నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఖానాపూర్‌: ఖానాపూర్‌కు మంజూరైన యంగ్‌ ఇండియా ఇంటిగ్రేటెడ్‌ స్కూల్‌ను ఉట్నూర్‌కు తరలించడాన్ని నిరసిస్తూ ఇంటిగ్రేటెడ్‌ స్కూల్‌ సాధన సమితి శనివారం తలపెట్టిన పట్టణ బంద్‌ సంపూర్ణంగా జరిగింది. పట్టణంలోని వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌ పాటించాయి. జిల్లా పరిషత్‌ బాలికల పాఠశాలతోపాటు, ఇతర పాఠశాలలను మూసివేయించేందుకు వెళ్లిన జేఏసీ నాయకులను సీఐ అజయ్‌తోపాటు ఎస్సై రాహుల్‌గైక్వాడ్‌ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. నాయకులను అరెస్టు చేసి పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులు, నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. కార్యక్రమంలో నాయకులు సాగి లక్ష్మణ్‌రావు, ఆకుల శ్రీనివాస్‌, కొండాడి గంగారావు, పుప్పాల గజేందర్‌, ఎనగందుల నారాయణ, కాశవేని ప్రణయ్‌, గౌరికార్‌ రాజు, ఇర్ఫాన్‌, నసీర్‌, ప్రణీత్‌, రాపెల్లి రవీందర్‌, బి.మురళికృష్ణ, మాదాసు మురళి, దివాకర్‌, మేస సతీశ్‌, జెట్టి సురేందర్‌ తదితరులు పాల్గొన్నారు.



కల్మషం లేనిదే స్నేహం..!

- అమ్మానాన్నల తర్వాత స్నేహితులకే ప్రాధాన్యం
- దోస్తులు చాలామందే..
- నేడు స్నేహితుల దినోత్సవం



భైంసాటౌన్‌/ఆసిఫాబాద్‌/బోథ్‌/మంచిర్యాల/బెల్లంపల్లి/చెన్నూర్‌: స్నేహం.. మనసుతో మొదలై మనతో కడవరకూ సాగేది. చదువులో.. ఆటల్లో.. జీవితంలో కలిసి మెలిసి ప్రయాణం సాగించేది. ఎప్పుడు ఎక్కడ మొదలైనా నీడలా సాగుతూనే ఉంటుంది. మంచినీ.. చెడునూ నిర్మొహమాటంగా ఎత్తిచూపి సన్మార్గంలో నడిపిస్తుంది. అందుకే అన్నారు ఓ కవి '..శ్వాసగా నిలిచేటిది స్నేహమొక టేనురా..' తరాలు మారుతున్నా కల్మషం లేని స్నేహం కొనసాగుతోంది. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ఆధ్వర్యంలో సర్వే నిర్వహించగా.. కల్మషం లేనిదే స్నేహమని అభిప్రాయం వ్యక్తమైంది. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా వ్యాప్తంగా 125 మంది మహిళలు, 125 మంది పురుషులు మొత్తంగా 250 మంది సర్వేలో పాల్గొన్నారు. స్నేహం ఎప్పటికీ కలుషితం కాదని స్పష్టం చేశారు. నేటి తరం తల్లిదండ్రులనూ స్నేహితులుగానే భావిస్తున్నారు. తల్లిదండ్రుల తర్వాత తమ మనసులో స్నేహితులకే మొదటి స్థానమని తేల్చిచెప్పారు. స్నేహం విస్తరిస్తూ స్నేహితుల సంఖ్య పెరిగిపోతుండగా.. నిజమైన స్నేహితుల సంఖ్య ఇద్దరుకు మించి ఉందనే అభిప్రాయం వ్యక్తం చేశారు.

స్నేహమే జీవితానికి వెన్నెల

- దోస్తానా మాధుర్యం అనిర్వచనీయం
- మైత్రీబంధానికున్న ప్రాధాన్యత ప్రత్యేకం

నిర్మల్‌ఖిల్లా: కష్టసుఖాల్లో కలిమీలేమీల్లో.. నీ కోసం నేనున్నాను.. అని భుజం తట్టే ఆత్మీయమైన స్పర్శ స్నేహం. ఈ మైత్రీబంధం ఆనందాన్ని రెట్టింపు చేస్తుంది. విషాదాన్ని తగ్గిస్తుంది. ఆత్మీయమైన స్నేహాలు, ఉన్నతమైన మానవతా విలువలు నిశీధిలో ఉషోదయంలా దారి చూపుతూనే ఉన్నాయి. చిన్నప్పుడు...బుడి బుడి అడుగుల బాల్యంలోనే అల్లుకునే స్నేహ బంధాలు కొన్నయితే.. పరవళ్లు తొక్కే యవ్వనంలో పెనవేసుకునే అనుబంధాలు మరికొన్ని.. ఈ బంధం నిజంగానే జీవితానికి వెలుగునిస్తుంది.

ఈ ఫొటోలోని ముగ్గురు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలకు చెందినవారు. ఇంటర్‌ చదువుకునే రోజుల్లో వీరిమధ్య ఏర్పడిన స్నేహం బలపడింది. ప్రస్తుతం ముగ్గురూ బోధనా వృత్తిలో ఉన్నారు. ఇద్దరు డిగ్రీ కళాశాల అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ స్థాయిలో ఉండ

స్ఫూర్తి కెరటాలు..

గా, మరొకరు జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌. వీరి 16వ ప్రాయంలో ఏర్పడిన స్నేహబంధం దృఢపడుతూ వస్తోంది. తమ స్నేహ బంధంతో యువతకు స్ఫూర్తిగా నిలిచారు. కటకం మురళి, యూ.రవికుమార్‌, కందూరి శంకర్‌. దిగువ మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన వీరు అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. ఒకరి కష్టాన్ని ఒకరు పంచుకున్నారు. ఒకరి తడి కంటిని మరొకరు తుడిచి ధైర్యం పంచుకున్నారు. చివరకు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. అక్కడితో ఆగకుండా జూనియర్‌ అధ్యాపకులుగా, డిగ్రీ కళాశాల అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌, ప్రిన్సిపాల్‌ స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం నిర్మల్‌లో స్థిరపడినవీరు.. ఇప్పటికీ ప్రతి సందర్భంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ సలహాలు సూచనలు ఒకరికొకరు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. వీరి మైత్రిబంధం నిజమైన స్నేహానికి స్ఫూర్తి.



అధ్యాపకవృత్తిలో ఉన్న ముగ్గురు మిత్రులు వీరే..



'నిర్మలమిత్ర' స్నేహితుల బృందం ఇదే..

'నిర్మల'మైన మైత్రిబంధం..

కల్మషం.. అసూయ.. ద్వేషం లేనిది స్నేహం. ఒకరికి ఒకరు అన్నట్టుగా ఉంటూ, కష్టసుఖాల్లో కలిమిలేములలో భుజం తట్టి తోడుగా నిలిచే స్నేహం ఏ బంధానికి సాటిరాదు. ఇందుకు నిదర్శనం నిర్మల్‌కు చెందిన ఈ 11 మంది మిత్ర బృందం. పుష్కరకాలానికి పైగా కలిసిమెలిసి ఉంటూ 'నిర్మల మిత్ర' పేరుతో స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నారు. కష్టకాలంలో ఒకరికి ఒకరు తోడుగా నిలుస్తున్నారు. అంతా కలిసి కుటుంబాలతో ఆనందోత్సాహాల మధ్య గడుపుతున్నారు. ఏదైనా అనుకోని కష్టం వచ్చినా రక్త సంబంధీకులు బంధువులు వస్తారో రారో తెలియదు కానీ వీరు మాత్రం క్షణాల్లో అక్కడికిచేరి భరోసా అందించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. వీరంతా కష్టపడి చదివి వివిధ రకాల ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు చెందిన వీరందరూ ఉద్యోగరీత్యా నిర్మల్‌లో ప్రస్తుతం నివాసం ఉంటున్నారు. ఇప్పటికీ వారానికోసారి కలుసుకుంటారు. సాధక బాధకాలను పంచుకోవడం వీరి మైత్రిబంధాన్ని బలోపేతం చేస్తోంది.

ఒక కెమెరా వందమంది పోలీసులకు సమానం



సీసీ కెమెరాను పరిశీలిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్‌: ఒక సీసీ కెమెరా.. వంద మంది పోలీసులతో సమానమని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కాలనీలో ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలను శనివారం ప్రారంభించారు. అంతకుముందు కాలనీలోని హనుమాన్‌ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎస్పీ మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు ప్రధాన ఆయుధమన్నారు. జిల్లా ప్రజల సహకారంతో ఇప్పటి వరకు 10 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఇవన్నీ జియో ట్యాగింగ్‌ ద్వారా కమాండ్‌ కంట్రోల్‌ సెంటర్‌కు అనుసంధానం చేశామని చెప్పారు. ఈ మధ్యకాలంలో జరిగిన జ్యువెలరీ దొంగతనం, షట్టర్‌ లిఫ్టింగ్‌ కేసు ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో శ్రీనగర్‌ కాలనీ పట్టణంలోని అన్ని కాలనీలకు ఆదర్శంగా నిలిచిందని అభినందించారు. అనంతరం కాలనీవాసులు ఎస్పీని సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రవీణ్‌ కుమార్‌, ఎస్సై సంజీవ్‌, శ్రీనగర్‌కాలనీ అధ్యక్షుడు భానుచందర్‌, ప్రధాన కార్యదర్శి రాకేశ్‌, కోశాధికారి సాయినాథ్‌, భూమయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ సంకల్పం

- ర్యాగింగ్‌, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన



సదస్సులో పాల్గొన్న జడ్జీలు శ్రీవాణి, రాధిక, దేవేంద్రబాబు, ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్‌, విద్యార్థులు

బాసర: బాసరలోని రాజీవ్‌ గాంధీ యూనివర్సిటీ ఆఫ్‌ నాలెడ్జ్‌ టెక్నాలజీస్‌(ఆర్జీయూకేటీ)లో జిల్లా న్యాయసేవా సమన్వయంతో 'ర్యాగింగ్‌ నివారణ, మాదకద్రవ్యాల విపత్తు నివారణ'పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి, సీనియర్‌ సివిల్‌ జడ్జి రాధిక, ఇన్‌చార్జి వైస్‌ ఛాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ గోవర్ధన్‌, భైంసా మేజిస్ట్రేట్‌ దేవేంద్రబాబు, ఏఎస్పీ అవినాష్‌ ఇంజినీరింగ్‌ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ర్యాగింగ్‌, డ్రగ్స్‌పై కఠిన చర్యలు..

ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్‌ గోవర్ధన్‌ మాట్లాడుతూ, క్యాంపస్‌ను ర్యాగింగ్‌, మాదకద్రవ్య రహితంగా ఉంచడం తమ లక్ష్యమని తెలిపారు. జిల్లా జడ్జి వాణి ర్యాగింగ్‌, డ్రగ్స్‌ దుష్పరిణామాలను వివరిస్తూ, ఫిర్యాదులపై కఠిన శిక్షలు విధిస్తామని స్పష్టం చేశారు. 1832–44లో చైనా–బ్రిటన్‌ డ్రగ్‌ యుద్ధాలను ఉదాహరణగా చెప్పారు. సీనియర్‌ జడ్జి రాధిక, న్యాయ సేవాసంస్థ పేదలకు, ఎస్సీ, ఎస్టీలకు సేవలందిస్తోందని, విద్యార్థులను లీగల్‌ పారా వాలంటీర్లుగా చేరాలని కోరారు.

వసతి గృహాల పరిశీలన..

1997లో తమిళనాడు ర్యాగింగ్‌ నిరోధక చట్టం తీసుకొచ్చిన నేపథ్యాన్ని రాధిక వివరించారు. ర్యాగింగ్‌ ఫిర్యాదులను కమిటీకి తెలపాలని సూచించారు. అనంతరం బాలికల వసతి గృహం, భోజనశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. జిల్లా కోర్టు సూపరింటెండెంట్‌ పురుషోత్తంరావు, ముధోల్‌ సీఐ మల్లేశ్‌, బాసర ఎస్సై శ్రీనివాస్‌, డీన్‌లు నాగరాజు, డాక్టర్‌ విఠల్‌, చంద్రశేఖర్‌, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేరు తెచ్చిన పెంబి..

- ఉత్తమ ఫలితాలు సాధించిన పెంబి బ్లాక్‌
- సంపూర్ణత అభియాన్‌తో పలుమార్పులు
- ఏబీపీలో జాతీయర్యాంకు
- గవర్నర్‌ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్‌



గవర్నర్‌ చేతులమీదుగా అవార్డు స్వీకరిస్తున్న కలెక్టర్‌ అభిలాష అభినవ్‌

నిర్మల్‌/పెంబి: పెంబి.. చుట్టూ దట్టమైన అడవుల మధ్య కనీసం సరైన తోవ కూడా లేని ఊళ్లతో, ఇప్పటికీ కరెంటును చూడని పల్లెలతో, అభివృద్ధి అనే పదానికి అర్థం కూడా తెలియని గూడేలతో ఉన్న మండలం. అలాంటి మండలమే ఇప్పుడు జిల్లాకు పేరు తీసుకొచ్చింది. నిర్మల్‌ కీర్తిని జాతీయస్థాయిలో నిలబెట్టింది. కేంద్ర ప్రభుత్వం నీతిఆయోగ్‌ ద్వారా చేపట్టిన ఆస్పిరేషనల్‌ బ్లాక్‌ ప్రోగ్రామ్‌(ఆకాంక్షత జిల్లాల కార్యక్రమం)ద్వారా చేపట్టిన కార్యక్రమాల్లో పెంబి మండలం ఉత్తమ ప్రగతిని సాధించింది. గతేడాది డిసెంబర్‌లో ప్రకటించిన ర్యాంకుల్లో జాతీయస్థాయి నాల్గోస్థానంలో నిలిచింది. ఈ మేరకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా కలెక్టర్‌ అభిలాషఅభినవ్‌ శనివారం పురస్కారం అందుకున్నారు.

ఆకాంక్షత బ్లాక్‌గా ఎంపికై..

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం 2018 జనవరిలో నీతిఆయోగ్‌ ద్వారా ఆస్పిరేషనల్‌ (ఆకాంక్షత) డిస్ట్రిక్ట్స్‌(బ్లాక్‌) ప్రోగ్రామ్‌ ప్రారంభించింది. దేశవ్యాప్తంగా గుర్తించిన 112 అత్యంత వెనుకబడిన జిల్లాలను త్వరగా, సమర్థవంతంగా మార్చడం ఈ కార్యక్రమం ఉద్దేశం. ఆయా జిల్లాల్లోనే వెనుకబడిన బ్లాక్‌(మండలాల)ల్లో ప్రజల ఆరోగ్యం, పోషకాహారం, విద్య, వ్యవసాయం, జల వనరులు, ఆర్థికాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలు తదితర సామాజిక, ఆర్థిక అంశాలలో పురోగతి సాధించాలన్న లక్ష్యంతో చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వెనుకబడిన మండలంగా పేరున్న పెంబి ఎంపికైంది.

పలు అంశాల్లో మార్పు...

ప్రోగ్రాంలో భాగంగా ఆరు అంశాలపై సంపూర్ణత అభియాన్‌ నిర్వహించారు. ఈ కార్యక్రమం జూలై 6, 2024న పెంబి బ్లాక్‌లో ప్రారంభించారు. నిరంతర పర్యవేక్షణ, కమ్యూనిటీ భాగస్వామ్యంతో సెప్టెంబర్‌ 31, 2024 వరకు కొనసాగింది. ఈ త్రైమాసిక కార్యక్రమాలతో పలు అంశాల్లో స్పష్టమైన మార్పు కనిపించింది. ప్రధానంగా ఆరు సూచికల్లో పరిశీలన చేపట్టగా, నాలుగింటిలో సంతృప్తకరమైన ఫలితాలు వచ్చాయి. ఆరోగ్యపరంగా మధుమేహం, రక్తపోటు, సప్లిమెంటరీ న్యూట్రిషన్‌లతోపాటు, భూసార పరీక్షలు, గర్భిణులకు సంబంధించిన పరీక్షలు, ఎస్‌హెచ్‌జీ రివాల్వింగ్‌ ఫండ్‌ కవరేజీ అంశాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి.

సంపూర్ణ అభియాన్‌తో మార్పులు..

అంశం	అభియాన్‌కు ముందు(శాతం)	అభియాన్‌ తర్వాత(శాతం)
గర్భిణులకు పరీక్షలు	90	100
మధుమేహ పరీక్షలు	35	100
రక్తపోటు పరీక్షలు	35	100
పోషకాహారం	68	100
భూసారపరీక్షలు	00	69.39
రివాల్వింగ్‌ ఫండ్‌ కవరేజీ	54	94.6

జాతీయస్థాయిలో నాల్గోస్థానం..

ఆస్పిరేషనల్‌ బ్లాక్‌ ప్రోగ్రాం(ఏబీపీ) ప్రధాన ఉద్దేశమైన వెనుకబడిన ప్రాంతాల్లో వివిధ అంశాల్లో మార్పు తీసుకురావడం అనేది పెంబి మండలం కనిపించడంపై నీతిఆయోగ్‌ సంతృప్తి వ్యక్తంచేసింది. ఏబీపీ కార్యక్రమ అమలు తీరుపై నీతిఆయోగ్‌ నెలవారీగా డెల్టా ర్యాంకింగ్‌ ప్రకటించింది. ఇందులో దేశంలోని మొత్తం 500 బ్లాకులలో మెరుగైన ఫలితాలతో పెంబి బ్లాక్‌ జాతీయస్థాయిలో నాలుగో ర్యాంకు సాధించింది.

చేయాల్సినవెన్నో..

అత్యంత వెనుకబడిన ప్రాంతంగా కేంద్రమే గుర్తించిన పెంబి మండలంలో ఏబీపీ ద్వారా ఆరోగ్యం, పోషకాహారం తదితర అంశాల్లో కొంత మార్పు కనిపిస్తోంది. ప్రధానంగా ఇక్కడి ఆదివాసీ మహిళల్లో రక్తహీనత, పోషకాహారలోపం ఎక్కువ. ఈకారణంగానే గర్భస్థ శిశుమరణాల సంఖ్య ఉంటోంది. ఆస్పిరేషనల్‌ బ్లాక్‌ కార్యక్రమం వీటిలో మార్పు కనిపిస్తున్నా.. ఇప్పటికీ ఆ మండలంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. ప్రధానంగా చాకిరేవు వంటి చాలా గ్రామాలకు ఇప్పటికీ రోడ్లు, కరెంటు లేదు. చాలా ఊళ్లు సరైన తాగునీటికి నోచుకోవడం లేదు. వర్షాకాలం వాగులు పొంగితే రాకపోకలకూ ఇబ్బందే. తాజాగా జాతీయస్థాయిలో జిల్లాకు గుర్తింపు తెచ్చిన పెంబి మండలంపై ఇప్పటికైనా ప్రభుత్వాలు దృష్టిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు గురుకుల విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్‌, పీఈటీలు

తానూరు(ముథోల్‌): ముధోల్‌ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌ పోటీలకు ఎంపికయ్యారు. తెలంగాణ అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో వరంగల్‌లోని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో 3వ తేదీ నుంచి జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌ పోటీలలో వి.సిద్ధార్థ 200 మీటర్లు, కె.సాయిరాం 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొంటారని ప్రిన్సిపాల్‌ నర్సింహారెడ్డి తెలిపారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు సంజీవ్‌, దేవోజి శ్రీకాంత్‌, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం


దశరథ్

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఉప్కెల దశరథ్ (30) అదృశ్యమయ్యారు. ఎస్సై శ్రీసాయి తెలిపిన వివరాల ప్రకారం.. దశరథ్ కొన్నినెలలుగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని శాస్త్రీనగర్‌లో కూరగాయాలు అమ్ముతూ కుటుంబంతో కలిసి జీవించేవాడు. అతని భార్య శైలజకు ఆర్యోగం బాగా లేకపోవడంతో గతనెల 13న స్వంత గ్రామమైన బోథ్‌కు వచ్చాడు. ఐదు రోజుల క్రితం భార్యను నేరడిగొండలోని తన పుట్టింటికి వెళ్లింది. దశరథ్ గతనెల 31న నిర్మల్ వెళ్లి వస్తానని తల్లి లక్ష్మీతో చెప్పి వెళ్లాడు. రెండు రోజులైన తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికిన దొరకలేదు. భార్య శైలజ ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి మృతికి కారకుడి అరెస్ట్


వెల్లడిస్తున్న పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: యువకుడి మృతికి కారకుడిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. స్థానిక వెంకటాద్రిపేట్ కాలనీకి చెందిన నల్ల అభిలాష్ తన స్నేహితుడితో కలిసి గతనెలలో స్కూటీపై వెళ్తున్నాడు. బంగల్‌పేట్ కాలనీకి చెందిన బైండ్ల స్వామి మద్యం మత్తులో బైక్ నడుపుతూ ఎదురుగా వచ్చిన స్కూటీని ఢీకొట్టాడు. ప్రమాదంలో అభిషేక్ తీవ్రంగా గాయపడి, ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేసి బైండ్ల స్వామిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మట్కా ఆడుతున్న 8 మంది అరెస్ట్

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని గాంధీ పార్క్ సమీపంలో మట్కా ఆడుతున్న 8 మందిని శనివారం పట్టుకుని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై సుధాకర్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.5240 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఎవరైనా మట్కా ఆడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

కడెం ప్రాజెక్ట్‌లో దూకిన యువకుడు

- కాపాడిన టూరిజం సిబ్బంది


యువకుడిని కాపాడుతున్న సిబ్బంది

కడెం: మండల కేంద్రానికి చెందిన యువకుడు శనివారం సాయంత్రం కడెం ప్రాజెక్ట్ కుడి కాలువలో దూకాడు. స్థానికుల సమాచారంతో టూరిజం(బోటింగ్) సిబ్బంది హుటాహుటిన వెళ్లి తాడు సహాయంతో యువకుడిని రక్షించారు. యువకుడు ప్రాజెక్ట్‌లో ప్రమాదవశాత్తు పడిపోయాడా, ఆత్మహత్య కోసం దూకాడనేది తెలియరాలేదు. ఈ విషయమై ఎస్సై సాయికిరణ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, మద్యం మత్తులో దూకి ఉంటారనే అనుమానం ఉందని పేర్కొన్నారు.

ఆస్తులు సంపాదించినవాడు కాదు, ఆప్తులను సంపాదించినవాడే నిజమైన అదృష్టవంతుడు. స్నేహితుడు.. ఎవరి సమక్షంలో బాధలు సగానికి సగమై, ఆనందం రెట్టింపవుతుందో, ప్రపంచంలో ఎవరూ విడిచిపెట్టినా నీవు ఒంటరి కాకుండా తోడుంటారో, వారే నిజమైన మిత్రులు. స్వచ్ఛమైన స్నేహం ఒక అపురూప దివ్యమణి, హృదయాలను అనుసంధానం చేసే ఆత్మీయ వారధి. ఆధునిక కాలంలో యాంత్రిక జీవనం, ఆర్థిక సంబంధాల మధ్య స్వార్థం లేని స్నేహం కోసం తపించే హృదయాలెన్నో.. అయినా, చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం, గత జ్ఞాపకాలు నెమరువేసుకోవడం ఆ హృదయాలకు ఊరటనిస్తుంది. సాంకేతికత స్నేహబంధాలకు కొత్త ఊపిరి పోసింది. ఫేస్‌బుక్, వాట్సాప్ లాంటి సామాజిక మాధ్యమాలు దూరమైన మిత్రులను దగ్గర చేశాయి. ట్రెండ్ మారినా.. నిజమైన ఫ్రెండ్ మారలేదు. నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆప్తమిత్రులపై ప్రత్యేక కథనం.

- ఆత్మీయ బంధాల సౌరభం స్నేహం
- కష్టసుఖాల్లో తోడుండేవాడు మిత్రుడు
- నిజమైన మిత్రులే గొప్ప ఆస్తి
- నేడు స్నేహితుల దినోత్సవం



దోస్తే.. మేరా దోస్త్

ఈ బంధం విడదీయలేనిది


స్నేహితులు తోట రాము, పిప్పెర కృష్ణ

భైంసా: పట్టణానికి చెందిన పిప్పెర కృష్ణ, తోట రాము 40 ఏళ్లుగా స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నారు. తానూరు మండలం బోసి గ్రామానికి చెందిన పిప్పెర గజ్జారాం భైంసాకు వచ్చి స్థిరపడ్డాడు. భట్టిగల్లిలో పెరిగిన పిప్పెర కృష్ణ, తోట రాముతో కలిసి చదువుకున్నాడు. క్రికెట్ ఆడుతూ యువజన సంఘం ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు కొనసాగించాడు. భైంసా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన పిప్పెర కృష్ణ తన చిన్ననాటి స్నేహితుడు తోట రామును మరిచిపోలేదు. పట్టణంతోపాటు చుట్టుపక్కల ఏ పని ఉన్న ఇద్దరు మిత్రులు కలిసే వెళ్తారు. ఈ స్నేహబంధం ఇప్పటికి ఎవరు విడదీయలేనిది.

ఆపదలో అండగా 'సోపతిమిత్ర'

నెన్నెల: నెన్నెల మండలం చిన్నవెంకటాపూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు జలంపల్లి శ్రీనివాస్ తన ఆలోచనతో సోపతి వెల్ఫేర్ సొసైటీకి పునాది వేశారు. జైపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పదో తరగతి వరకు చదువుకున్న మిత్రులు రాజబాబు, సాంబశివ, రాచర్ల శ్రీనివాస్, నీలాల శ్రీనివాస్, కృష్ణ, రవికిషన్, నారాయణ, తిరుపతితో కలిసి మొత్తం 110 మంది స్నేహితులతో ఈ సొసైటీని ఏర్పాటు చేశారు. మిత్రులకు ఏ ఆపద వచ్చిన అందరూ కలిసి వాట్సాప్ గ్రూపుల్లో చర్చించుకుని వారి సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. ఐదేళ్ల నుంచి ఇప్పటివరకు రూ.6 లక్షలకుపైగా ఆర్థిక సాయం అందిస్తూ వస్తున్నారు. ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు రక్తదానం, రక్తహీనతతో బాధపడుతున్న తలసేమియా బాధితులకు రక్తం కావాలన్నా మేమున్నామంటున్నారు. పలు సేవా కార్యక్రమాలతో పాటు ఆర్థికసాయం అందిస్తూ అభాగ్యులకు అండగా నిలుస్తున్నారు.


గాయపడిన మిత్రుడికి ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

రెండేళ్లకోసారి గెట్ టు గెదర్


స్నేహితులు దేవేందర్‌రావు, రవీందర్‌రెడ్డి, ఓదెలు

చెన్నూర్: కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం అమ్మనగుర్తిలో దేవేందర్‌రావు (ప్రస్తుత చెన్నూర్ సీఐ) ఐదో తరగతి చదువుతున్నప్పుడు మిల్కూరి రవీందర్ రెడ్డి, మొర్రె ఓదెలు స్నేహితులు. ఓదెలు ప్రజాప్రతినిధి కాగా, రవీందర్‌రెడ్డి స్వగ్రామంలో వ్యవసాయం చేస్తున్నాడు. వీరి స్నేహం 30 ఏళ్లకు పైగా కొనసాగుతోంది. ఎక్కడ ఉన్నా శుభ కార్యాల్లో ముగ్గురు కలిసి వెళ్తారు. రెండేళ్లకోసారి గెట్ టూ గెదర్ ఏర్పాటు చేసి చిన్ననాటి మిత్రులందరినీ కలుసుకుంటారు.

ఏడో తరగతి నుంచి


స్నేహితులు శ్రీనివాస్, గజ్జారాం

భైంసా: 7వ తరగతి గదిలో ప్రారంభమైన స్నేహబంధాన్ని పట్టణానికి చెందిన లాగేట్‌వార్ శ్రీనివాస్, పల్సి గజ్జారాంలు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. సాయిబాబానగర్‌కు చెందిన శ్రీనివాస్ డిజిటల్ సౌండ్ సిస్టం షాప్ ఉండగా, పల్సి గజ్జారాం ఆటో నడుపుతున్నాడు. కుటుంబ సభ్యులకు కష్టాలు వచ్చినా ఇద్దరు కలిసి చర్చించుకుంటారు. 27 ఏళ్లుగా స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నారు.

30 ఏళ్లుగా..


చిరకాల స్నేహితులు నిఖిల్, గణేశ్

భైంసా మండలం తిమ్మాపూర్‌కు చెందిన అనంతుల నిఖిల్ ముద్దోళ్ల గణేశ్ చిన్నతనం నుంచే స్నేహితులు. గణేశ్ భైంసాలో సీడ్స్, ఫర్టిలైజర్ షాప్ ఉండగా, నిఖిల్ భైంసాలోని నిఖిల్ రెస్టారెంట్ నడుపుతున్నాడు. 30 ఏళ్లుగా స్నేహం కొనసాగుతూనే ఉంది. రోజు ఇంటి నుంచి కలిసి వచ్చి తిరిగి కలిసే ఇంటికి వెళ్తారు.

కష్టసుఖాల్లో తోడునీడగా..


ఆత్రం వామన్, షేక్ సలీం(ఫైల్)

సాత్నాల: భోరజ్ మండలం మాండగడలో ఆత్రం వామన్ (జూనియర్ అసిస్టెంట్), షేక్ సలీం (ఆర్ఎంపీ) మూడో తరగతిలో స్నేహం మొదలైంది. ఆర్థిక పరిస్థితి సరిగా లేక ఆత్రం వామన్ పలు సందర్భాల్లో షేక్ సలీం ఇంట్లో అన్నం తిని పాఠశాలకు వెళ్లేవాడు. తన స్నేహానికి కులం అడ్డు రాదని ఆ గ్రామంలో కృష్ణాలయం నిర్మాణ సమయంలో షేక్ సలీం రూ.25 వేలు విరాళంగా అందించారు. హిందువుల పండుగల వేళ షేక్ సలీం కుటుంబ సభ్యులతో కలిసి వామన్ ఇంటికి వస్తారు. ముస్లిం పండుగలు ఉన్నప్పుడు వామన్ కుటుంబ సభ్యులతో సలీం ఇంటికి వెళ్తారు. 43 ఏళ్లుగా ఒకరికొకరు కష్టాల్లో పాలుపంచుకుంటూ తమ స్నేహాన్ని కొనసాగిస్తున్నారు.

సేవల్లో టాప్


ముద్గల్‌లో మొక్కలు నాటుతున్న స్నేహితులు

ముధోల్ మండలం ముద్గల్ గ్రామానికి చెందిన యువకులంతా సేవా కార్యక్రమాల్లో ముందు ఉంటున్నారు. గ్రామానికి చెందిన స్నేహితులంతా ఒకే చోట కలిసి అభివృద్ధిని కొనసాగిస్తున్నారు. జాతీయ రహదారికి 3 కి.మీ దూరంలో ఈ గ్రామం ఉంది. గ్రామంలో స్నేహితులంతా కలిసి శ్రమదానంతో రోడ్లు వేశారు. యువ భారత్ ఆధ్వర్యంలో శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. తాజాగా ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. స్వయం ఉపాధితో కుటుంబాలను పోషించే ఈ స్నేహితుల బృందం ముద్గల్ గ్రామ అభివృద్ధికి పాటుపడుతోంది.

19 ఏళ్లుగా స్నేహబంధం



ఆదిలాబాద్‌టౌన్: నేను 2006లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా చేరాను. ఆ సమయంలో నా స్నేహితురాలు మంజుల కెమిస్ట్రీ లెక్చరర్‌గా పరిచయమైంది. అప్పటి నుంచి మా స్నేహం ముడిపడింది. కళాశాలలో నాలుగేళ్లు పనిచేశాం. 2013లో నేను మహిళా డిగ్రీ కళాశాలకు పదోన్నతిపై వెళ్లగా, నా స్నేహితురాలు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు వెళ్లారు. ఆ తర్వాత నేను ఉట్నూర్‌కు బదిలీపై వెళ్లగా, ఆమె లక్సెట్టిపేట్ డిగ్రీ కళాశాలకు బదిలీ అయ్యారు. అయినప్పటికీ మా స్నేహబంధం కొనసాగుతోంది. 14 ఏళ్ల తర్వాత మళ్లీ ఆమె డిగ్రీ కళాశాలలో ఉండడంతో నేను అదే కళాశాలను ఎంచుకున్నాను. ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాను. ఇరు కుటుంబ సభ్యులు కష్టసుఖాల్లోనూ పాలు పంచుకుంటాం. 19 ఏళ్లుగా మా స్నేహం కొనసాగుతుంది.

- సంగీత, ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

స్నేహం వారి బలం


తొమ్మిది మంది మిత్రులు

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరికి చెందిన తిరుపతి గిత్తే, రమేశ్ పురి, రాజు పాతాడే, సుదగొనేవార్ మాధవ్, రాథోడ్ సుదర్శన్, తిరుపతి కాగ్నే, విష్ణు కేంద్రె, రాజు చోళే, బాలు తిడ్కే స్నేహితులు. వేర్వేరు కుటుంబాల నుంచి వచ్చినా, మనస్సులు ఒక్కటయ్యాయి. ప్రతీ పనిలో చోదోడు వాదోడుగా ఉంటున్నారు. ప్రతీ పండుగలో ఒక్కటై అన్ని తామే నిర్వహిస్తారు. కొందరు వ్యాపారులు, మరికొందరు విద్యావంతులుగా ఉన్నారు. ఏళ్లుగా ఒకే మాట.. ఒకే బాటపై నడుస్తున్న తొమ్మిదిమంది మిత్రులు స్నేహమేరా జీవితమంటూ తెలియజేస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటున్నారు.

మతాలు వేరైనా..


స్నేహితులు శ్రీకాంత్, అశ్వక్

తాంసి: తాంసికి చెందిన జానకొండ శ్రీకాంత్, వడ్డాడి గ్రామానికి చెందిన అబ్దుల్ అశ్వక్ 6వ తరగతి చదువుతున్నప్పుడు స్నేహితులయ్యారు. 30 ఏళ్లుగా స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. మతాలు వేరైన ఇళ్లలో జరిగే శుభకార్యాలు, కష్టసుఖాల్లో రెండు కుటుంబాలు పరస్పరం కలుసుకుంటాయి. ప్రస్తుతం చేస్తున్న వ్యాపారాల్లో ఒకరికొకరు పనులు చేసుకుంటారు.

దోస్తులంతా ఉద్యోగులే


చిన్ననాటి మిత్రులు

తానూరు: మండలంలోని భోసి గ్రామానికి చెందిన చిన్ననాటి మిత్రులు ఒకే చోట విద్యనభ్యసించి ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. 1 నుంచి 10వ తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి 1999లో 10వ తరగతి పూర్తిచేశారు. ఉన్నత చదవులు చదవి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. బి.సుధాకర్ (ప్రభుత్వ టీచర్), పి.గంగాధర్ (సాఫ్ట్‌వేర్), ఎల్.దత్తాత్రి (పీజీటీ టీచర్), ఎ.రాజేశ్వర్ (ఆరోగ్యమిత్ర)గా కొనసాగుతున్నారు.

మెడికో.. స్నేహ వారధి..

- వైద్య విద్యార్థుల ఫౌండేషన్
- ప్రతీనెల సేవా కార్యక్రమాలు
- స్నేహాన్ని పెంపొందించుకునేలా కార్యక్రమాలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ మొదటి బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల సేవాగుణం పలువురికి చేయూతనందిస్తోంది. విద్యార్థుల్లో స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పుతోంది. కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ.సులేమాన్ ఆధ్వర్యంలో గవర్నమెంటు మెడికల్ కాలేజీ ఫౌండేషన్, మంచిర్యాల పేరిట ఏర్పాటైంది. 2002లో మొదలైన మెడిసిన్ మొదటి బ్యాచ్ ఆరంభ్, 2023లో ఆరోహణ, 2024 బ్యాచ్ అద్వితీయగా నామకరణం చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతీ విద్యార్థి నెలకు రూ.100 చొప్పున జమ చేసి ఐదు లక్ష్యాలు ఆర్థిక సహాయం, పరిశుభ్రత, ఆరోగ్యం, విద్య, సోషల్ అవేర్‌నెస్‌లను ఎంచుకుని సహాయం అందిస్తున్నారు. మార్చి నుంచి జూలై వరకు లక్ష్యాలను పూర్తి చేశారు. ఈ ఏడాది మార్చిలో పేద మెడిసిన్ విద్యార్థికి మూడో సంవత్సరానికి హాస్టల్, కాలేజీ ఫీజు చెల్లించారు. మంచిర్యాలలోని బాలికల పాఠశాల విద్యార్థినులకు న్యాప్‌కిన్స్ అందించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కల్వరి వృద్ధాశ్రమం, ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన దివ్యాంగులు ఇద్దరికి రెండు ట్రైసైకిళ్లు అందించారు. లక్సెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల మండలాల్లో విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్, పెన్నులు, క్రీడాసామగ్రి అందజేశారు.


మంచిర్యాల జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాప్‌కిన్స్ పంపిణీలో మెడికోలు(ఫైల్)

బాలింతకు దారి కష్టాలు

- 2 కి.మీ కాలినడకతో ఇంటికి..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చిట్యాల్‌బోరి గ్రామస్తులకు వర్షాకాలంలో దారి కష్టాలు తప్పడం లేదు. గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో రెండుచోట్ల వాగులు ప్రవహిస్తాయి. వర్షాలు కురిస్తే రాకపోకలు నిలిచిపోతాయి. నాలుగు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఆడ లక్ష్మి ఆదిలాబాద్ ఆస్పత్రిలో ప్రసవమై డిశ్చార్జి ఇంటికి పయనమయ్యారు. గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక బాలింత 2 కి.మీ పసికందుతో కాలినడకన వెళ్లారు. రోడ్డు సౌకర్యం, వాగులపై వంతెనలు లేక అత్యవసర సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోతున్నారు.


పసికందుతో వాగుదాటుతున్న బాలింత

మానవత్వం చాటుకున్న కార్మికులు

- గాయపడ్డ ఎద్దుకు చికిత్స

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గని కార్మికులు మానవత్వం చాటుకున్నారు. రోడ్డు పక్కన గాయాలతో మూలుగుతున్న ఎద్దును చూసి దానికి సపర్యాలు చేసి సంరక్షణ కేంద్రానికి తరలించారు. వర్క్‌షాప్ నుంచి ఆర్కే 7 గనికి వెళ్లేదారిలో మూడురోజుల క్రితం గుర్తుతెలియని వాహనం ఓ ఎద్దును ఢీకొట్టి గాయపర్చింది. కాళ్లకు తీవ్ర గాయమై రక్తస్రావం జరగడంతో కదలకుండా అక్కడే పడి ఉంది. శనివారం ఉదయం డ్యూటీకి వెళ్లే కార్మికులు గమనించి రామకృష్ణపూర్‌కు చెందిన పశుసంరక్షణ కేంద్ర నిర్వాహకులు శ్రీధర్, రాజసమ్మయ్య సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకోగా దాన్ని తరలించడం ఇబ్బందిగా మారింది. కార్మికులు.. ఏజెంట్ శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్‌కు చెప్పడంతో ఆయన ఆదేశాలతో ఏరియా వర్క్‌షాప్ డీజీఎం రవీందర్ క్రేన్, వాహనాన్ని సమకూర్చారు. ఎద్దును లారీలో ఎక్కించి సంరక్షణ కేంద్రానికి తరలించి వైద్యం అందిస్తున్నారు. గని కార్మికులు మారుపల్లి సారయ్య, నాగరాజ్, రాజ్‌కుమార్, చిలుక రమేశ్ పాల్గొన్నారు.


ఎద్దును సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్న కార్మికులు

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న హరీశ్‌రాజ్

కాసిపేట: పీహెచ్‌సీలో వైద్యులు, వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలని, అత్యవసర పరిస్థితిలో మాత్రమే సెలవులు తీసుకోవాలని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ల్యాబ్, మందులు, వార్డులను పరిశీలించారు. మామిడిగూడలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని సందర్శించారు. ర్యాపిడ్ ఫీవర్ సర్వే, యాంటీ లార్వా ఆపరేషన్లు, గ్రామంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వైద్యసిబ్బంది సూచన మేరకు గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వైద్యాధికారి దివ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని బ్రాహ్మణవాడలో శనివారం సాయంత్రం పిచ్చికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. పట్టణంలోని బెస్తవాడకు చెందిన ముగ్గురు.. కాలనీ మీదుగా వెళ్తుండగా, కుక్క కరిచింది. వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. పిచ్చికుక్కల బెడద నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు


మాట్లాడుతున్న సోయం బాపూరావు

ఆదిలాబాద్‌రూరల్: ఉమ్మడి జిల్లాలో ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కుమురం భీం జిల్లాలో నిర్వహించే భారీ ర్యాలీ, బహిరంగ సభకు జాతీయ, రాష్ట్ర, అన్ని ఆదివాసీ తెగలు, ఆదివాసీ సంఘాల నాయకులు హాజరవుతారని తెలిపారు. ఆదివాసీలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పంద్రం శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనంద్ రావు, కుమ్ర శ్యామ్‌రావు, జంగు పటేల్, శేషరావు, సునీల్, రాజు, ఉపేందర్, హన్ను పటేల్, విజయ్, మనోహర్, మారుతి, మాణిక్ రావు, సూర్యబాన్, చిత్రు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి పథకం అమలుకు కృషి


మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: కార్మికుల చిరకాల కోరిక అయిన సొంతింటి పథకం అమలుకు కృషి చేస్తున్నామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య తెలిపారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఇటీవల జరిగిన స్ట్రక్చరల్ సమావేశంలో సొంతింటి పథకం, అలవెన్స్‌లపై ఆదాయ పన్ను చెల్లింపులు వంటి ప్రధాన డిమాండ్లకు యాజమాన్యం ఒప్పుకుందన్నారు. సొంతిల్లు నిర్మించుకొన్న వారికి కంపెనీ క్వార్టర్ వెకేషన్ సర్టిఫికెట్లు ఇవ్వడానికి అంగీకారం తెలిపిందన్నారు. డిస్మిస్ అయిన జేఎంఈటీలకు తిరిగి ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు ప్రసాద్‌రెడ్డి, బద్రి బుచ్చయ్య, నాయకులు తిరుపతి, సాయిరాజ్, రాజకుమార్ పాల్గొన్నారు.

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీస్ ఇన్‌చార్జి టి.ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని భోకర్‌కు చెందిన సాయినాథ్ సుంగుర్వాడ్ (40) గత కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. శనివారం తెల్లవారుజాము 3.30 గంటల ప్రాంతంలో ప్లాట్‌ఫాం–1 రైలు పట్టాలపై తల పెట్టాడు. ఆదిలాబాద్ నుంచి పర్లి వెళ్లే ప్యాసింజర్ రైలు వెళ్లడంతో మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.